



ఖేడ్‌లో అనుమతి లేకుండా నడుపుతున్న సిటీ స్కాన్ సెంటర్‌ను సీజ్ చేస్తున్న డీఎంహెచ్‌వో

అనుమతి లేని సిటీ స్కాన్ సెంటర్ సీజ్

నారాయణఖేడ్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్‌లో గురువారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారిణి గాయత్రి అకస్మికంగా పలు డయాగ్నిస్టిక్ సెంటర్లు, సిటీ స్కాన్ సెంటర్లు, ప్రైవేటు వైద్యశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనుమతి లేకుండా నడుపుతున్న సిటీ స్కాన్ సెంటర్‌తో పాటు బయోవేస్టేజ్ లేకుండా కొనసాగిస్తున్న పద్మావతి వైద్యశాలలోని డయాగ్నిస్టిక్ సెంటర్‌ను ఆమె సీజ్ చేశారు.

సోనియా, రాహుల్‌గాంధీలపై కేసులను నిరసిస్తూ..

జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ మహాధర్నా

సంగారెడ్డి పోస్టాఫీసు కేంద్ర కార్యాలయం వద్ద ధర్నాకు భారీగా తరలివచ్చిన కార్యకర్తలు



సంగారెడ్డిలోని పోస్టాఫీసు కేంద్ర కార్యాలయం వద్ద మహాధర్నాలో ప్రసంగిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

సంగారెడ్డి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ పత్రిక విషయంలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్‌గాంధీలపై తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపిస్తూ గురువారం సంగారెడ్డి పోస్టాఫీసు కేంద్ర కార్యాలయం వద్ద టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. బ్యానర్లు, ఫ్లెక్సీలు పట్టుకొని నిరసన తెలిపారు. జగ్గారెడ్డి పిలుపు మేరకు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు తరలివచ్చి బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మోదీ, అమిత్‌షాలు కుట్రపన్నారని జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తోపాజీ అనంతకిషన్, కూన సంతోష్, జార్జ్, కిరణ్‌గౌడ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ మహాధర్నాలో పాల్గొన్న జగ్గారెడ్డి, కార్యకర్తలు

బోనులో చిక్కిన చిరుత

ఇక్రిశాట్‌లో

చిరుత కలకలం

అటవీశాఖ బోనుకు చిక్కడంతో ఊపరి పీల్చుకున్న సిబ్బంది

పటాన్‌చెరు/ మదీన, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని ఇక్రిశాట్ పరిశోధనా సంస్థలో చిరుతపులి సంచారం కలకలం రేపింది. ఇక్రిశాట్ పరిశోధనా వ్యవసాయ క్షేత్రాలలో చిరుత సంచరిస్తున్నట్లు రెండు రోజుల క్రితం సిబ్బంది గుర్తించారు. దీంతో అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది సంగారెడ్డి జిల్లా అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. అటవీశాఖ అధికారులు చిరుతను బంధించేందుకు పలు చోట్ల బోన్లను ఏర్పాటు చేశారు. ఇలా ఏర్పాటు చేసిన ఓ బోనులో గురువారం తెల్లవారుజామున చిరుత చిక్కింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా అటవీ అధికారి శ్రీధర్‌రావు మాట్లాడుతూ పట్టుబడిన సుమారు ఆరేళ్ల వయసున్న చిరుత పూర్తి ఆరోగ్యంగా ఉందని, హైదరాబాద్‌లోని జూపార్క్‌కు తరలించి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మూడున్నర వేల ఎకరాల్లో విస్తరించిన ఇక్రిశాట్‌లో గతంలో కూడా చిరుతలు ప్రవేశించగా బంధించారు.



మనోహరాబాద్‌లో 'భూభారతి'పై మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

'భూ భారతి' ఓ వరం

చట్టంపై అవగాహనా సదస్సులో మెదక్, సంగారెడ్డి కలెక్టర్లు

మెదక్/తూప్రాన్/మనోహరాబాద్/సదాశివపేట/కొండాపూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టం రైతుల పాలిట వరమని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. ధరణి స్థానంలో ప్రభుత్వం తీసుకువచ్చిన భూహక్కుల చట్టం భూభారతిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించడానికి గురువారం నుంచి మండలాల్లో సదస్సులు ప్రారంభమయ్యాయి. తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో నిర్వహించిన సమావేశాల్లో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో నిర్వహించిన సమావేశంలో ఆ జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పాల్గొని దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా ప్రజలకు వేగంగా సేవలందించేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. ప్రజావాణిలో దాదాపు 70 నుంచి 80 శాతం భూసంబంధిత సమస్యలు ఉంటున్నాయి.

ధరణిలో అప్పీలు చేయడానికి అవకాశం లేదని, కేవలం సివిల్ కోర్టు ద్వారా మాత్రమే పరిష్కరించడానికి అవకాశం ఉందని, ఈ నూతన చట్ట ద్వారా వచ్చే ఫిర్యాదు ఆధారంగా ఆర్డీవో, కలెక్టర్ ల్యాండ్ ట్రిబ్యునల్ ద్వారా పరిష్కరించడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ప్రజలకు ఏ విధంగా అయితే ఆధార్ కార్డు ఉందో భూములకు ప్రభుత్వం భూదార్ కార్డు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఉచిత న్యాయ సేవలు కూడా ఈ చట్టం ద్వారా అందించేందుకు అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు. పెండింగ్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. ప్రతి మండలంలో జరుగుతున్న అవగాహన సదస్సుల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని చట్టంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని సూచించారు, రానున్న పాస్‌బుక్కుల్లో భూమ్యాప్, హద్దులు కూడా ఉంటాయని పేర్కొన్నారు. భూములపై పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్‌వోఆర్ చట్టాన్ని తెచ్చిందని వివరించారు. ప్రతి కేంద్రంలో సమావేశలకు రైతులు హజరై భూ భారతి చట్టం గురించి తెలుసుకోవాలన్నారు. ధరణి స్థానంలో అమలులోకి వచ్చిన కొత్త భూభారతి చట్టంతో భూరికార్డుల నిర్వహణ పటిష్ఠంగా ఉంటుందన్నారు. భూహక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు ఆవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పెండింగ్ సాదాబైనామా దరఖాస్తులకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. వారసత్వంగా సంక్రమించే భూములకు నిర్ణిత కాలంలో విచారణ ఉంటుందన్నారు. భూసమస్యల పరిష్కారం కోసం రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ అమలులో ఉంటుదన్నారు. ప్రతీ భూకమతానికి భూధార్ కార్డుల జారీ చేస్తారని తెలిపారు. గత ప్రభుత్వం మోసపూరితంగా భూ హక్కుల రికార్డులను మార్చిందని తెలిపారు.



సదాశివపేటలో భూ భారతి చట్టంపై అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

ఆయిల్‌పామ్‌కు సై..

మెదక్ జిల్లాలో విస్తరిస్తున్న సాగు

- నిజాంపేట మండలం చల్మెడలో నర్సరీ
- మూడు వేల ఎకరాల సాగు లక్ష్యం
- ఇప్పటికే వెయ్యి ఎకరాల్లో సాగు
- సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు
- జిల్లాలో పామాయిల్ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు



మెదక్, ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి): మెతుకు సీమ రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. జిల్లా ఉద్యానవనశాఖ అధికారులు అన్ని మండలాల్లో రైతులకు అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నారు. రెండేళ్ల క్రితం వరకూ మెదక్ జిల్లాలో రైతులకు ఈ పంటపై ప్రాథమిక అవగాహన కూడా ఉండేది కాదు. ఇటీవల ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటోంది. అధిక లాభాలు ఆర్జించే అవకాశం ఉండటం, మొక్కజొన్న, పత్తి, వేరుశనగ వంటి అంతరపంటల సాగుకు అవకాశం ఉండటంతో రైతులు మొగ్గు చూపుతున్నారు.

పెట్టుబడి తక్కువ

ఆయిల్‌పామ్ ఒక్కసారి నాటితే నాలుగా సంవత్సరం నుంచి 30 ఏళ్ల వరకూ దిగుబడి వస్తుంది. చీడ పీడలు, వర్షాలు, కోతులు, అడివిపందులు బెడద ఉండదు. గాలివానలతోనూ నష్టం ఉండదని ఉద్యానవన శాస్త్రవేత్తలు భరోసా ఇస్తున్నారు. జిల్లాలో కోతుల బెడద విపరీతంగా పెరిగిపోవడంతో రైతులు కూరగాయలు, ఉద్యానవన పంటలు సాగు చేయడానికి వెనకడుగు వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో 2023 నవంబరులో జిల్లాలో ఆయిల్ పామ్ సాగు చేయడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం జిల్లా రైతులు ఆయిల్‌పామ్ సాగులో ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, సిరిసిల్ల, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలతో పోటీపడుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం వెల్దుర్తి, మెదక్, కొల్చారం, రామాయంపేట, టేక్మాల్, రేగోడ్, శివంపేట, కౌడిపల్లి, మండలాలకు చెందిన రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. గత 2023 సంవత్సరంలో ఆయిల్‌పామ్ గెలలు టన్నుకు రూ.14,174 ధర పలుకగా ప్రస్తుతం రూ.21వేలకు పెరిగింది. ఖర్చులు పోనూ ఎకరాకు రూ. లక్షన్నర లాభం వస్తుందని అధికారులు తెలిపారు.

జిల్లావ్యాప్తంగా అవగాహనా సదస్సులు

ఆయిల్‌పామ్ పంట సాగుపై రైతులకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కల్పిస్తున్నట్లు లివ్‌పామ్ రిసోర్సెస్ కంపెనీ మెదక్ యూనిట్ మేనేజర్ అశోక్ కుమార్ తెలిపారు. ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్‌సింగ్ ఆదేశాలతో డ్రిప్ కంపెనీ ప్రతినిధులు రైతులను ఆయిల్ పామ్ సాగు విధానంపై అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. పంటకాపు రావడం ప్రారంభమైన వెంటనే బై బ్యాక్ చేస్తారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో దర మరింతగా పెరగనుందని తెలిపారు. జిల్లాలోని నిజాంపేట మండలం చల్మెడలో నర్సరీ ప్రారంభించామని, త్వరలోనే ఆయిల్‌పామ్ ఇండ్రస్ట్రీ ఏర్పాటు చేయనున్నట్లు వారు వివరించారు.

చల్మెడలో నర్సరీ

రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు రైతులకు పలు రకాలుగా సబ్సిడీ అందిస్తోంది. .బహిరంగ మార్కెట్‌లో రూ.190లకు లభ్యమయ్యే మొక్క రూ.20లకే సబ్సిడీపై ఇస్తున్నారు. రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ సౌకర్యం కల్పిస్తోంది. ఎస్సీ ఎస్టీ రైతులకు పూర్తి సబ్సిడీ ఇస్తున్నారు. మొక్కలు ప్లాంటేషన్ చేసిన తర్వాత మొదటి 4 సంవత్సరాలు నిర్వహణ వ్యయం ప్రభుత్వమే భరిస్తుంది. ఒకసారి పంట వేశాక 30 సంవత్సరాల పాటు సాగు ఫలాలను పొందవచ్చునని అధికారులు చెబుతున్నారు. మొదట నాలుగు సంవత్సరాల్లో అంతరపంట కలుపు తీయడానికి, ఇతర నిర్వహణ ఖర్చుల కోసం ఎకరానికి రూ.4,200 ఆర్థిక సహాయం అందుతుంది. చెట్లు పెరిగే కొద్ది మెళకువలు పాటిస్తూ 15 నుండి 20 టన్నుల వరకూ దిగుబడి సాధించవచ్చునంటున్నారు. ఈ లెక్కన ఎకరాకు సుమారు 2 లక్షల వరకూ ఆదాయం పొందే అవకాశం ఉంది.

మెడికల్ కాలేజీల్లో ఫేస్ రికగ్నిషన్ హాజరు

- మే 1 నుంచి అమలుకు ఎన్ఎంసీ నిర్ణయం
- ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలకు వర్తింపు
- ఇక బయోమెట్రిక్ హాజరుకు స్వస్తి
- కొత్త విధానంతో డుమ్మా, నకిలీ డాక్టర్లకు చెక్

5

మామిడీలా

- పడిపోయిన దిగుబడి
- గతేడాది కంటే పెరిగిన రేటు
- టన్నుకు రూ.70వేల వరకు పలికిన ధర
- కాత లేకపోవడంతో రైతులకు తప్పని నష్టం

5



అటు ఎండ.. ఇటు వాన!

- ఉమ్మడి మెదక్ జిల్లాలో 41.2 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత
- మధ్యాహ్నం ఎండ.. సాయంత్రానికి వర్షం

మెదక్ అర్బన్/కోహీర్/ఝరాసంగం/నర్సాపూర్/శివ్వంపేట/చిన్నశంకరంపేట/పాపన్నపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఉదయం ఎండ దంచికొట్టగా, సాయంత్రం అకస్మాత్తుగా వర్షం కురిసింది. సాధారణంగా మేలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయి. అందుకు భిన్నంగా 41 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరాయి. ఉయదం 10 గంటలకు భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. మధ్యాహ్నం ఎండ ప్రభావంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. వాతావరణ శాఖ మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాలను ఆరెంజ్ అలర్ట్‌ను ప్రకటించింది.

ఉష్ణోగ్రతలు ఇలా..

మెదక్ జిల్లా పాతూర్ 41.2 డిగ్రీలు, కొల్చారం, అల్లాదుర్గం 41.2, మెదక్ 41.1, టేక్మాల్ 40.9, దామరంచ 40.8, వాడి 40.5, కౌడిపల్లి 40.3, చిన్నశంకరంపేట, రాజ్‌పల్లి 40.1 డిగ్రీలు నమోదయ్యాయి. సిద్దిపేట జిల్లా సముద్రాల 40.5, సిద్దిపేట 40.3, నారాయణరావుపేట, కోహెడ, బెజ్జంకి 40.2 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదయ్యాయి. సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి 40.3, కల్హేర్ 40.2, నిజాంపేట 40.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.



కోహీర్ మండలం కవే చౌరస్తా కురుస్తున్న వర్షం

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో వర్షం

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో గురువారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. సంగారెడ్డి జిల్లా కోహీర్, ఝరాసంఘం మండలాల్లో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కూరిసింది. పలు గ్రామాల్లో చెట్లు విరిగిపడ్డాయి. మామిడి కాయలు నెలరాలాయి. ఝరాసంగం మండలం కుప్పానగర్ గ్రామంలో పిడుగుపాటుకు 23 మేకలు మృతిచెందాయి. మెదక్ జిల్లా నర్సాపూర్, శివ్వంపేట, పాపన్నపేట, చిన్నశంకరంపేట మండలాల్లో వర్షం కురిసింది. నర్సాపూర్‌లో వడగళ్లు పడ్డాయి. పలు చోట్ల రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. కోతకు వచ్చిన వరి పంట నెలకొరిగింది. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. మామిడి కాయలు రాలిపోయాయి.



జరాసంఘం మండలం కుపానగర్‌లో పిడుగుపాటుకు మృతి చెందిన మేకలు



పాపన్నపేట మండలం మిన్పూర్ గ్రామంలో అకాల వర్షానికి తడిసి ముద్దయిన వడ్లు



శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో వడగళ్లు



శిక్షణలో మాట్లాడుతున్న ఎస్పీ

కేసుల పరిష్కారంలో సాంకేతికత సాయం

సంగారెడ్డి ఎస్పీ పంకజ్

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కేసుల పరిష్కారంలో ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. ఫింగర్ ప్రింట్ లైవ్ స్కానర్, ఎంఎస్‌సీడీ పాపిలోన్ డివైస్‌పై సిబ్బందికి గురువారం పోలీసులకు సంగారెడ్డిలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫింగర్ ప్రింట్ లైవ్ స్కానర్, ఎంఎస్‌సీడీ పాపిలోన్ డివైస్ వినియోగంపై ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేసుకోవాలని అన్నారు. ప్రతీ ఒక్కరు నిబద్ధతితో పని చేయాలని, తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలో ఎన్నో గుర్తు తెలియని మృతదేహాలను పింగర్ ప్రింట్స్ ఆధారంగా గుర్తించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, సబ్ ఇన్స్‌పెక్టర్ పింకీ కుమారి, జయసింహ పిసి ప్యాకల్టీగా సిబ్బంది పాల్గొన్నారు.

ఇక ఆటవిడుపు..

విద్యార్థుల వార్షిక పరీక్షలు పూర్తయ్యాయి. 1 వ తరగతి నుంచి 9 వ తరగతి వరకు ఈ నెల 9 వ తేదీన సమ్మెటీవ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ-2) పరీక్షలు ప్రారంభం కాగా, గురువారంతో ముగిశాయి. ఈ నెల 24 వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రారంభం కానుండగా, ఈ నెల 23 న తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి ఆన్‌లైన్ ప్రోగ్రెస్ కార్డులు(ప్రగతి పత్రాలు) విద్యార్థులకు అందజేయనున్నారు. వార్షిక పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఆనందం ఉత్సాహంతో ఇంటికి పయనమయ్యారు. సంక్షేమ వసతి గృహాలు, వివిధ గురుకుల పాఠశాలల్లో ఉండే విద్యార్థులు తమ సామగ్రితో సొంతింటికి పయనమయ్యారు. తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు జిల్లా కేంద్రానికి వచ్చారు. సంగారెడ్డి కొత్త బస్టాండ్ విద్యార్థులతో కిటకిటలాడి కనిపించింది.

-సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి)



సంగారెడ్డి నుంచి సొంతూళ్లకు ప్రయాణమైన విద్యార్థులు

240 కిలోల గంజాయి స్వాధీనం


పోలీసుల అదుపులో ఎండు గంజాయి తరలిస్తున్న నిందితులు

మునిపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు వేర్వేరు చోట్ల పోలీసులు మొత్తం 240 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు ఎండు గంజాయిని గురువారం ఓ కారులో నలుగురు వ్యక్తులు తీసుకెళ్తున్నట్లు మునిపల్లి పోలీసులకు సమాచారం అందింది. దీంతో మండలంలోని కంకోల్ టోల్‌ప్లాజా వద్ద మునిపల్లి ఎస్‌ఐ రాజేష్ నాయక్ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానం వచ్చి కారు ఆపి తనిఖీ చేయగా ఎండు గంజాయిని ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఎండు గంజాయిని తరలిస్తున్న వ త్సల్ రామ్ శెట్టి, ఆకాశ్ , అజయ్ దేశ్ముఖ్, సోహెల్‌లను విచారించగా కర్ణాటక రాష్ట్రం బీదర్‌లోని ఇరాని గల్లీలో కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకెళ్తున్నట్లు వారు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. పట్టుబడిన 130గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ నాయక్ తెలిపారు. అలాగే మరో ఘటనలో జహీరాబాద్ వైపు నుంచి ఎండు గంజాయిని బైక్‌లపై హైరాబాద్ వైపు తీసుకెళ్తుండగా కంకోల్ టోల్‌ప్లాజా వద్దే బైక్‌లను ఆపి తనిఖీ చేయగా అందులో ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. బీదర్‌లోని ఇరాని గల్లీలో కొనుగోలు చేసి హైదరాబాద్ వైపు తీసుకెళ్తున్న గంజాయిని తరలిస్తున్నట్లు నిందితులు రియాజ్ పాషా, రేహాన్ గంజాయి తరలిస్తున్న నిందితుల్లో సోఫియాన్, ఆసిఫ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు 110గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ నాయక్ తెలిపారు.

బెజ్జంకి పోలీస్ స్టేషన్‌కు గ్రహణం

● ఏ ఎస్సై వచ్చినా మూన్నాళ్ల ముచ్చటే ● కుర్చీ ఎక్కాలంటే వణుకు ● ఆరోపణలతో గడువుకు ముందే బదిలీలు



బెజ్జంకి పోలీసు స్టేషన్

బెజ్జంకి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : బెజ్జంకి పోలీస్‌స్టేషన్‌కు అవినీతి మకిలీ అంటుకుంటుందా? ఇక్కడ పనిచేయాలంటే ఇక్కడి రాజకీయ నాయకులు, చోటామోటా నాయకులు చెప్పినట్లు వినాల్సిందేనా? అనే ప్రశ్నలకు అవుననే సమాధానం వస్తుంది. ఏళ్ల తరబడి ఇక్కడ పనిచేస్తున్న పలువురు అధికారుల పనితీరు చూస్తే చాలా మంది ఎస్సైలు గడువు ముగియకముందే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటు బదిలీ అవడం, సస్పెండ్ అవుతుండడంతో బెజ్జంకి ఎస్సై స్థానంలోకి రావాలంటేనే జంకుతున్నారు. ప్రధానంగా ఇక్కడ ఉన్న రాజకీయ పరిస్థితులు, అక్రమ ఇసుక తరలింపు, ఇతర అక్రమ దందాలు అధికారుల మెడకు చుట్టుకుని ఇక్కడి నుంచి అవినీతి మరకలు అంటించుకుని వెళ్తున్నారు.

ఎనిమిదేళ్లు ఎనిమిది మంది ఎస్సైలు

బెజ్జంకి పోలీస్ స్టేషన్‌లో ఎనిమిదేళ్ల నుంచి ఇప్పటి వరకు ఎనిమిది మంది ఎస్సైలు విధులు నిర్వహించారు. ఎస్సైలు సాధారణంగా రెండు నుంచి మూడు సంవత్సరాల వరకు ఆయా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తుంటారు. కానీ బెజ్జంకి పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన అధికారులకు పలువురు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ బదిలీ అవతున్నారు. ఈ ఎనిమిది మందిలో నలుగురు ఇసుకదందాను చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలతో బదిలీ కాగా, మరో ఇద్దరు ఇతర కమిషనరేట్‌లో పనిచేయాలనే ఉద్దేశంతో బదిలీపై వెళ్లారు. మరో ఎస్సై అతడి సొంత ప్రాంతమైన ఇతర కమిషనరేట్ పరిధిలో జరిగిన చిన్న వివాదంతో సస్పెండ్ అయ్యాడు. ఇక్కడి రాజకీయ నాయకులు తమకు అనుకూలంగా ఉన్న వ్యక్తులకు పోస్టింగ్‌లు ఇవ్వడంతో గతంలో పనిచేసిన అధికారుల స్థానంలో వచ్చారు. కొత్తగా బెజ్జంకి ఎస్సైగా రావాలంటే ఆలోచిస్తున్నారు.

రాజకీయ ఒత్తిళ్లతోనే ఉద్యోగం

పోలీసు అధికారిగా ఉద్యోగం అంటేనే ఒత్తిళ్లతో, సవాళ్లతో కూడుకున్నది. విధి నిర్వహణలో ఒత్తిడి కంటే రాజకీయ ఒత్తిళ్లు ఎక్కువవుతున్నాయి. అధికార పార్టీకి రాజకీయ నాయకులకు అనుగుణంగా ఉన్నవారికే పోస్టింగులు దక్కుతున్నాయి. ఆ తర్వాత సదరు నాయకులు, పార్టీకి చెందిన వారు చెప్పిన పనులు చేయాలని ఒత్తిడి తెస్తుండడంతో వారు చెప్పినట్లు చేసే క్రమంలో వివిధ ఆరోపణలు వస్తున్నాయి. అధికార పార్టీవాళ్లు తమకు అనుగుణంగా అధికారులు వ్యవహరించాలని వారిపై ఒత్తిడి తెస్తుండడంతో విధి నిర్వహణలో నిక్కచ్చిగా ఉండాలా, నాయకులు చెప్పినట్లు విని పోస్టింగ్‌ను కాపాడుకోవాలా అన్న డైలమాలో ఉంటున్నారు. ఏది ఏమైనా బెజ్జంకి పోలీస్ స్టేషన్ ఎస్సై కుర్చీలో కూర్చోవాలంటే కాస్తా ఆలోచించి రావడమే మంచిదని పలువురు అధికారులు అనుకుంటున్నారు.

షార్ట్ సర్క్యూట్ తో ఇంట్లో సామగ్రి, రూ.లక్ష నగదు దగ్ధం

అక్కన్నపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఇంట్లో సామగ్రి, రూ.లక్ష నగదు, ధాన్యం కాలిపోయింది. ఈ సంఘటన అక్కన్నపేట మండలం పంతులు తండాలో జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బానోతు పకలియా అనే రైతు వ్యవసాయ బావి వద్దకు వెళ్లి వచ్చేసరికి మధ్యాహ్నం ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల పొగలు వస్తుండడంతో చుట్టుపక్కల వారి సహకారంతో మంటలను ఆర్పి వేశారు. రూ. 4లక్షల విలువైన సామగ్రి, రూ.లక్ష నగదు కాలిపోయినట్లు బాధితులు తెలిపారు.

గొర్రెలు, మేకల చోరీ ముఠా అరెస్ట్


దొంగల వివరాలు వెల్లడిస్తున్న గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి

వర్గల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గొర్రెలు, మేకల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా సభ్యులను గౌరారం పోలీసులు పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ సంఘటనకు సంబంధించి గురువారం గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ బర్కత్‌పూర విక్రమ్‌నగర్ కాలనీకి చెందిన నీరజ్‌కుమార్ (21), కాచిగూడకు చెందిన మాఖన్ విశాల్ సింగ్ (22), రాహుల్, బాబు మొత్తం నలుగురు ఒక ముఠాగా ఏర్పడి గొర్రెలు, మేకలు దొంగతనం చేయడానికి నిర్ణయించుకున్నారు. మార్చి 24న రాత్రి హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్ లాంగ్ డ్రైవ్ కార్ వద్ద రాహుల్‌కు చెందిన ద్విచక్ర వాహనం షూరిటీపై ఉంచి సెల్ఫ్ డ్రైవ్ కారును అద్దెకు తీసుకున్నారు. నలుగురు కలిసి కారులో సిద్దిపేట వైపు వెళ్తూ మేకల దొడ్డిలు గమనించారు. మల్లారెడ్డిపల్లి గ్రామం వద్ద చీర్ల మల్లేశం మేకల దొడ్డి కనిపించడంతో అందులో నుంచి 4 మేకలను కారులో వేసుకొని హైదరాబాద్ జియాగూడ మార్కెట్లో గుర్తు తెలియని వ్యక్తులకు అమ్మేశారు. మార్చి 26న తొగుట శివారులో ప్రాంతంలోని రాంపూర్ గ్రామం వద్ద గొర్రెల దొడ్డిలో నుంచి 4 గొర్రెలను దొంగలించి హైదరాబాద్ జియా గూడ మార్కెట్లో అమ్మేశారు. గురువారం ఉదయం నీరజ్‌కుమార్, మఖన్ విశాల్ సింగ్‌ను పట్టుకుని విచారించడంతో దొంగతనం చేసినట్లు అంగీకరించారు. నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

జహీరాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక, జీవితంపై విరక్తిచెంది తెలుగు వెంకన్న(48) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని అల్గోల్ గ్రామంలో గురువారం జరిగింది. అల్గోల్ గ్రామానికి చెందిన తెలుగు వెంకన్న ఎల్‌ఐసీ ఏజెంటుగా పనిచేస్తూ పొలంపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తెలుగువెకన్న గతంలో ఓ కంపెనీలో ఏజెంట్‌గా పనిచేశాడు. కంపనీ ఎత్తివేయడంతో పాలసీదారుల(కస్టమర్ల)కు చెల్లించాల్సిన డబ్బులు బయట వ్యక్తుల వద్ద అప్పులుతెచ్చి చెల్లించాడు. అప్పు ఇచ్చిన వారి నుంచి వేధింపులు ఎక్కువ కావడంతో గ్రామసమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకన్న భార్య తుల్జమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

నకిలీ ట్రాన్స్‌జెండర్లకు దేహశుద్ధి


ట్రాన్స్‌జెండర్ల వేషధారణలో వచ్చిన వారు

మనూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్ల వేషధారణతో మాయ మంత్రాలు చేస్తామని ప్రజలకు ఇబ్బందులు కలిగించిన వారిని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన గురువారం మండల కేంద్రమైన మనూరులో జరిగింది . న్యాల్‌కల్ మండల కేంద్రానికి చెందిన తుల్జారాం,చంద్రయ్యలు చీరలు కట్టుకొని ట్రాన్స్‌జెండర్లుగా గ్రామంలోకి ప్రవేశించి పలువురిని మాయ మంత్రాలతో మీకు లాభం చేకూరుస్తామని మోసం చేసే ప్రయత్నం చేయగా గ్రామస్థులు వారిని పోలీసులకు అప్పగించారు. ఎస్సై శంకరయ్య వారిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

విష ఆహారం తిని పాడి ఆవులు మృతి

● ఒకేసారి మూడు చనిపోగా, రెండింటికి అస్వస్థత
● రూ.3లక్షల వరకు నష్టం

హత్నూర, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విష ఆహారం తిని మూడు పాడి ఆవులు మృతి చెందాయి. ఈ సంఘటన గురువారం ఉదయం హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచునూర్ గ్రామంలో జరిగింది. ఆ గ్రామానికి చెందిన రైతు మన్నె సత్తయ్య పాడి ఆవులు, గేదెలు పెంచుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. రోజువారి మాదిరిగానే బుధవారం సాయంత్రం గ్రామ శివారులోని చెరువు సమీపంలో ఆవులు, గేదెలను మేత కోసమని తీసుకెళ్లాడు. చెరువు సమీపంలోని పోచమ్మ ఆలయం వద్ద వారం రోజుల క్రితం సినిమా షూటింగ్ నిర్వహించి, అక్కడ అమ్మవారికి నైవేద్యం సమర్పించేందుకు అన్నాన్ని కుప్పగా పోశారు. సుమారు మూడు క్వింటాళ్ల బియ్యంతో అన్నం రతిపోసి సన్నివేశాన్ని చిత్రీకరించారు. షూటింగ్ పూర్తి అయిన తర్వాత అది అలాగే వదిలేసి వెళ్లడంతో అన్నం పూర్తిగా కుళ్లిపోయి విషంగా మారినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. దాన్ని తిన్న పశువులు కొన్ని అస్వస్థతకు గురికాగా గురువారం ఉదయం అందులో మూడు పాడి ఆవులు మృతి చెందాయి. మరో రెండు అస్వస్థతకు గురై ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితిలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశాడు. అస్వస్థతకు గురైన గేదెలు, ఆవులను పశుసంవర్ధక శాఖ అధికారులు పరిశీలించి అవసరమైన టీకాలు వేశారు. పాడి ఆవుల మృతితో సుమారు మూడు లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు సత్తయ్య తెలిపారు. ప్రభుత్వం ఆదుకొని న్యాయం చేయాలని కోరారు.

భార్యలు దూరమయ్యారని భర్త ఆత్మహత్య

రామచంద్రాపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భార్యలు దూరమయ్యారని ఓ భర్త గురువారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. అస్సాంకు చెందిన బిశాల్(30) కొల్లూరులోని సిగ్నిచర్ అపార్టుమెంట్ల వద్ద ఉన్న కార్ వాషింగ్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. ఇతనికి ఇద్దరు భార్యలు. పెద్ద భార్యకు ఒక కుమారుడు ఉన్నాడు. బిశాల్ తరుచూ భార్యతో గొడవపడటం, తిట్టడం, కొట్టడంతో ఆమె భర్తను విడిచి కొడుకుతో తన పుట్టింటికి వెళ్లిపోయింది. ఆ తరువాత నందిగామకు చెందిన మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఆమె పట్లకూడ మొదటి భార్య విషయంలో వ్యవరించినట్లు వ్యవరించేవాడు. ఆమె కూడా భర్తను విడిచిపెట్టి వెళ్లిపోయింది. దీంతో తీవ్రమైన మనస్థాపం చెందిన బిశాల్ గురువారం ఉదయం కారు వాష్ సెంటర్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడని సీఐ తెలిపారు. భార్యలకు సమాచారం అందించిన పోలీసులు సాయంత్రం వరకు వేచి చూశారు. చివరకు తోటి కూలీ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం ట్రాక్టర్ బోల్తా .. ఒకరు మృతి

● ఇరువురికి గాయాలు


గడ్డమీది అశోక్(ఫైల్)

నారాయణఖేడ్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువెళ్తుం డగా ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడడంతో ఒకరు మృతి చెందగా ఇరువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం ఉదయం ఖేడ్ పరిధిలో జరిగింది. నిజాంపేట మండలం శాఖాపూర్‌కు చెందిన గడ్డమీది అశోక్(35)తన పొలంలో పండిన ధాన్యాన్ని నిజాంపేటలోని కొనుగోలు కేంద్రంలో విక్ర యించడానికి ట్రాక్టర్‌పై తీసుకువెళ్తుండగా, అదుపుతప్పడంతో బోల్తా పడిందని స్థానికులు తెలిపారు. దీంతో అశోక్, ఇంజన్‌లో చిక్కుకొని అక్కడికక్కడే మృతి చెందాడు. అశోక్‌కి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ట్రాక్టర్‌పై నలుగురు ఉండగా బీర్ల లక్ష్మయ్య, బీరయ్యలకు తీవ్రమైన గాయాలు, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. అశోక్ భార్య సవిత ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నారాయణ ఖేడ్ ఎస్సై విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు.

వాటర్ ట్యాంకర్ ఢీకొని బాలుడికి గాయాలు

గుమ్మడిదల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక వాడలోని వీరన్న గూడెంలో బుధవారం ఓ బాలుడు ట్యాంకర్ ట్రాక్టర్ కింద పడి తీవ్రమైన గాయాల పాలైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం బీహార్‌కు చెందిన బాలుడు బుధవారం రాత్రి 8 గంటలకు వీరన్నగూడెం వీధిలో ఆడుకుంటున్నాడు. వీరన్న గూడెం నుంచి ఓ వాటర్ ట్యాంకర్ డ్రైవర్ మద్యం మత్తులో ఆడుకుంటున్న బాలుడిని ఢీకొనడంతో తీవ్రమైన గాయాలు పాలయ్యాడు. బాలుడి కుడికాలు విరగడంతో హైదరాబాదులోని సూరారం మల్లారెడ్డి ఆసుపత్రికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులు చికిత్స చేయిస్తున్నారు. అయితే మండలంలో బోర్ల నుంచి నీటిని తోడి పరిశ్రమలకు అక్రమంగా తలిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

కెమికల్ పరిశ్రమలో అగ్నిప్రమాదం

పటాన్‌చెరు రూరల్, ఏప్రియల్ 17 (ఆంధ్రజ్యోతి) : పాషమైలారంలోని ఓ కెమికల్ పరిశ్రమంలో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు కానీ భారీ స్థాయిలో ఆస్థినష్టం వాటిల్లింది. పరిశ్రమ ప్లాంట్‌లో సాల్వెంట్స్ వద్ద ఫైరింగ్ రావడంతో మంటలు ఎగబాకి రియాక్టర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పలువురు కార్మికులు తెలిపారు. సమాచారం అందుకున్న పటాన్‌చెరు ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. బీడీఎల్ సీఐ స్వామి గౌడ్ తన సిబ్బందితో పరిశ్రమకు చేరుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నారు.

ట్రాక్టర్ ఢీ కొని వ్యక్తి మృతి

అక్కన్నపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన అక్కన్నపేట మండలం కట్కూరు గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగింది. మండలంలోని గొల్లకుంటకు చెందిన గూడూరు మల్లేష్(70) అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై గొల్లకుంటకు వెళ్తుండగా కట్కూరు శివారులో వెనకనుంచి వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. మల్లేష్‌కి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. చిన్న కుమారుడు అజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



కాంగ్రెస్ నిరసనలో నీలం మధు

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు. నేషనల్ హెరాల్డ్ విషయంలో కక్షపూరితంగా వ్యవహరిస్తూ సోనియాగాంధీ రాహుల్‌గాంధీ పేర్లను చార్జిషీట్‌లో చేర్చడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

● అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ


తెలుగు డైరీని ఆవిష్కరిస్తున్న అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ ఉపేంద్రశర్మ

చేర్యాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధితో పాటు అర్చక ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ కృషి చేస్తున్నారని రాష్ట్ర దేవాదాయశాఖ అర్చక, ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ అన్నారు. కొమురవెల్లి మల్లన్న ఆలయ గెస్ట్‌హౌజ్‌లో గురువారం తెలుగు డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 15 నుంచి రాష్ట్రంలో సరస్వతీ పుష్కరాలు జరగనున్నాయని, అందుకు కాళేశ్వర ముక్తేశ్వర ఆలయ ప్రాంతంలో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో బుద్ది శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్, వీరశైవాగమ పాఠశాల అధ్యాపకుడు వీరేశ లింగం, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

మామిడీలా

పడిపోయిన దిగుబడి

గతేడాది కంటే పెరిగిన రేటు

టన్నుకు రూ. 70వేల వరకు పలికిన ధర

కాత లేకపోవడంతో రైతులకు తప్పని నష్టం


హుస్నాబాద్ కొనుగోలు కేంద్రంలో మామిడి కాయలు

హుస్నాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వర్షాభావ పరిస్థితులతో మామిడితోటలను పెంచే మెట్టప్రాంత రైతులు ఈసారి నష్టాలను చవి చూస్తున్నారు. పూర్తిగా దిగుబడి తగ్గిపోవడంతో పెట్టిన పెట్టుబడులు రాని పరిస్థితి ఏర్పడింది. మొదట్లో పూత ఆశించిన మేరకు ఉన్నా తదుపరి వాతావరణ పరిస్థితుల ప్రభావంతో చెట్లకు కాయలు లేకుండా పోయాయి. మార్కెట్‌లో ధర బాగానే ఉన్న దిగుబడి లేక రైతులు కుదేలవుతున్నారు.

3,340 ఎకరాల్లో

హుస్నాబాద్ డివిజన్‌లో దాదాపు 3,340 ఎకరాలకుపైగా మామిడి తోటలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో బంగినిపల్లి, దశరి, కోత మామిడి తోటలు ఉన్నాయి. డివిజన్‌లోని అక్కన్నపేట మండలంలో 964.33 ఎకరాలు, హుస్నాబాద్ మండలంలో 712.06 ఎకరాలు, కోహెడ మండలంలో 1315.06 ఎకరాలు, బెజ్జంకి మండలంలో 349.20 ఎకరాలు మొత్తం 3,340.53 ఎకరాల్లో తోటలున్నాయి. ప్రతి ఏటా ప్రకృతి వైపరీత్యాల వల్ల మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతేడాది పూత వచ్చి కాత నిలిస్తే వడగండ్ల వానలతో దెబ్బతినడమే కాకుండా ధర కూడా లేకపోవడంతో నష్టాల బారిన పడ్డారు. ఈ సారి పూత వచ్చినా మారిన వాతావరణ పరిస్థితులతో రాలిపోవడంతో మళ్లీ నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. దీనికి తోడు తామెర పురుగు వల్ల మామిడి కాత అనుకున్నంతగా రాలేదు.


హుస్నాబాద్ నుంచి రవాణా చేస్తున్న మామిడికాయలు

ఈసారి టన్నుకు రెట్టింపు ధర

మామిడి ధర టన్నుకు గతేడాది కంటే రెట్టింపు పలుకుతున్నది. అయితే, దిగుబడి పూర్తిగా తగ్గడంతో రైతులకు నష్టాలు తప్పడం లేదు. ఆరు ఎకరాల మామిడి తోటలో కేవలం మూడు టన్నుల కాత కూడా రాలేదని రైతులు పేర్కొంటున్నారు. గతేడాది టన్ను ధర రూ.35 నుంచి 40 వేల వరకే ఉన్నా ఈసారి వరంగల్, కరీంనగర్, హుస్నాబాద్ మార్కెట్‌లో 60 నుంచి రూ.75 వేల వరకు ధర ఉందని, ఐదు రోజుల క్రితం కరీంనగర్ మార్కెట్‌లో రూ.90 వేలు కూడా ధర పలికినట్లు రైతులు పేర్కొంటున్నారు. హుస్నాబాద్ డివిజన్ నుంచి మామిడి కమీషన్ ఏజెంట్ గతేడాది 800 టన్నుల వరకు కొనుగోలు చేయగా ఈసారి 300 టన్నులు కూడా వచ్చే పరిస్థితి లేదని పేర్కొంటున్నారు.

వివిధ రాష్ట్రాలకు ఎగుమతి

హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఓ మామిడి కమీషన్ ఏజెంట్ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కొద్ది, గొప్ప కాసిన మామిడి కాయలను రైతులు కరీంనగర్, వరంగల్ మార్కెట్‌లతో పాటు ఇక్కడ కూడా విక్రయిస్తున్నారు. హుస్నాబాద్ ప్రాంతంలో కొనుగోలు చేసిన మామిడి కాయలను ఇక్కడి నుంచి ప్యాక్ చేసి వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ముఖ్యంగా ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, హర్యానా, పంజాబ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు పంపిస్తున్నారు.


హుస్నాబాద్‌లో కాత లేని మామిడి తోట

ఈసారి 300 టన్నులు కూడా వచ్చే పరిస్థితి లేదు

ఐదు సంవత్సరాల నుంచి హుస్నాబాద్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి మామిడిని మే నెల చివరి వరకు కొనుగోలు చేస్తున్నాం. గత సంవత్సరం దాదాపు 800 టన్నుల వరకు కొనుగోలు చేశాం. ఈసారి 300 టన్ను కూడా వచ్చే పరిస్థితి కనబడటం లేదు. ఇప్పటివరకు 10 టన్నులు మాత్రమే కొనుగోలు చేశామంటే కాత ఎంత తగ్గిందో అర్థం చేసుకోవచ్చు. కానీ, గతేడాది కంటే ఈసారి ధర ఎక్కువగానే ఉన్నది.

\- గురాల సందీప్, మామిడి కమీషన్ ఏజెంట్

ఆరు ఎకరాల తోటకు రెండు టన్నుల కాత లేదు



నాకు ఆరు ఎకరాల మామిడి తోట ఉన్నది. ఈసారి రెండు టన్నుల ఖాత కాయలేదు. మొదట్లో పూత వచ్చింది. మారిన వాతవరణంతో ఖాత లేకుంటా పోయింది. ఇంకా కాయ తెంపలేదు. ఏడాదంతా పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. పోయినసారి వడగండ్ల వర్షాలతో కాయ రాలిపోయింది. ఈసారి వాతావరణ పరిస్థితులతో కాయ రాకుండా పోయింది.

\- జనగామ నర్సింగరావు, మామిడి రైతు హుస్నాబాద్

మెడికల్ కాలేజీల్లో ఫేస్ రికగ్నిషన్ హాజరు

మే 1 నుంచి అమలుకు ఎన్ఎంసీ నిర్ణయం

ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలకు వర్తింపు

ఇక బయోమెట్రిక్ హాజరుకు స్వస్తి

కొత్త విధానంతో డుమ్మా, నకిలీ డాక్టర్లకు చెక్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో మే 1 నుంచి ఫేస్ రికగ్నిషన్(ముఖ ఆధారిత గుర్తింపు)తో హాజరు నమోదు చేసే విధానాన్ని ప్రవేశపెట్టేందుకు జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆధార్ ఆధారిత ఫేస్ రికగ్నిషన్ హాజరు విధానంతో ఇక బయోమెట్రిక్ విధానానికి స్వస్తి పలకనున్నారు.

సంగారెడ్డి జిల్లాలో నాలుగు కళాశాలలు

సంగారెడ్డి జిల్లాలో నాలుగు మెడికల్ కాలేజీలున్నాయి. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఉండగా, పసల్‌వాది, ఇస్నాపూర్, ఇంద్రేశంలో ఒక్కోటి చొప్పున ప్రైవేటు మెడికల్ కాలేజీలున్నాయి. సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో 27 మంది ప్రొఫెసర్లు, 34 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 61 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 32 మంది సీనియర్ రెసిడెంట్లు, 24 మంది కాంట్రాక్టు ఫ్యాకల్టీ ఉన్నారు. ఇక మూడు ప్రైవేటు కాలేజీల్లో కలిపి వివిధ హోదాల్లో సుమారు 150 మంది వరకు ఫ్యాకల్టీ పనిచేస్తున్నట్టు అధికారులు తెలిపారు.



సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల

కళాశాల, ఆస్పత్రిలో ఉంటేనే హాజరు

ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీలతో పాటు అనుబంధ ఆస్పత్రుల్లో విధులు నిర్వర్తించే డాక్టర్ల హాజరును ఇక నుంచి ఫేస్ రికగ్నిషన్ ద్వారా నమోదు చేస్తారు. ఫోన్‌లోని ప్రత్యేక యాప్ ద్వారా హాజరు నమోదు చేసుకుంటారు. కళాశాల, ఆస్పత్రి ఉన్న ప్రాంతాన్ని అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా నమోదు చేస్తారు. సదరు డాక్టర్.. కళాశాల, ఆస్పత్రిలో ఉంటేనే హాజరు నమోదు అవుతుంది. లేకపోతే హాజరు నమోదు కాదు. కాగా ఫేస్ రికగ్నిషన్ హాజరు నమోదు కోసం ఒకట్రెండు రోజుల్లో ఆయా మెడికల్ కళాశాల, ఆస్పత్రుల్లో పనిచేసే డాక్టర్ల పూర్తి వివరాలను ఎన్ఎంసీ సేకరించనున్నది.

సరికొత్త విధానంతో డుమ్మాలకు చెక్

ఎన్ఎంసీ తీసుకురానున్న కొత్త విధానంతో మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యుల డుమ్మాలు, నకిలీలకు చెక్ పడనుంది. బయోమెట్రిక్ హాజరు ఉన్నప్పటికీ పలువురు సక్రమంగా హాజరుకాకపోవడం, మరికొందరు సొంతంగా ప్రైవేటు ప్రాక్టీస్ చేసుకుంటూ విధులకు ఎగనామం పెడుతున్నారే ఆరోపణలున్నాయి. వాస్తవానికి ఉదయం 9 గంటలకు మళ్లీ సాయంత్రం 4 గంటలకు బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలనే నిబంధనలను పలువురు ఖాతరు చేయడం లేదు. ఇటీవల సంగారెడ్డి కలెక్టర్ జీజీహెచ్‌ను సందర్శించిన క్రమంలో ఈ విషయం వెలుగులోకి రావడంతో 17 మందికి మెమోలు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఎన్ఎంసీ తీసుకున్న నిర్ణయంతో డాక్టర్లు రెగ్యులర్‌గా వచ్చి మెడికోలకు బోధనతో పాటు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించే అవకాశం ఏర్పడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

ప్రమాదకరంగా రేడియల్ రోడ్డు ఎక్స్‌టెన్షన్-30

రామచంద్రాపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్)ను కలుపుతూ రామచంద్రాపురం మండల పరిధిలో నిర్మిస్తున్న రేడియల్ ఎక్స్‌టెన్షన్-30 రోడ్డు ప్రమాదకరంగా మారింది. గోపన్‌పల్లిలోని విప్రో సర్కిల్ నుంచి తెల్లాపూర్, ఉస్మాన్ నగర్ మీదుగా కొల్లూరు ఓఆర్ఆర్ వరకు ఉన్న రోడ్డు అనేక మలుపులు, వంపులతో యాక్సిడెంటల్ స్పాట్‌లను తలపిస్తున్నాయి. నాలుగు రోజుల క్రితం ఉస్మాన్‌నగర్ రోడ్డులోని రాజ్‌పుష్ప మలుపు వద్ద ఓ టిప్పర్ బైక్‌ను ఓవర్ టేక్ చేసే క్రమంలో బైక్‌పైనుంచి వెళ్లడంతో ఓ వ్యక్తి నుజ్జునుజ్జయి దుర్మరణం పాలయ్యాడు. ఇటీవల ఈ రోడ్డులో అనేక ప్రమాదాలు చోటుచేసుకోగా ఎనిమిది మంది మృత్యువాత పడ్డారు.

మత్యుదారిగా 'జడ్' మూలమలుపు


ఈ ప్రాంతంలో విల్లాలు, అపార్ట్‌మెంట్‌లు ఎక్కువ కావడంతో జనసంచారం బాగా పెరిగింది. వాహనాల రద్దీ ఎక్కువైంది. తెల్లాపూర్‌లోని మైహోమ్ సయాక్ అపార్ట్‌మెంట్ దాటాక వచ్చే మలుపు, తర్వాత ఆకృతి సీఆర్‌పీ విల్లాస్ వద్ద మలుపు, హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద, ఏఆర్‌వీ నైవా విల్లాల నుంచి రాజ్‌పుష్ప వరకు జడ్ ఆకారంలోని మలుపు, ఉస్మాన్‌నగర్ శివాలయం వద్ద మలుపు యాక్సిడెంట్ స్పాట్‌లుగా మారాయి. ఈ దారిలో ప్రమాదకర జడ్ ఆకారం మలుపు వద్ద అసలే వాహనదారులు భయభయంగా వెళుతుంటే రోడ్డు పక్కన నిర్మించిన ట్రాఫిక్ ఐలాండ్ మరింత ఇబ్బందికరంగా మారిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా రోడ్డు విభాగిని మధ్యలో, చౌరాస్తాలలో ఏర్పాటు చేయాల్సిన ట్రాఫిక్ ఐలాండ్‌ను రహదారి పక్కన ఏర్పాటు చేయడంపై అటు వైపు నుంచే వెళ్లే వాహనదారులు మండిపడుతున్నారు. బైక్‌ను ఓవర్ టేక్ చేస్తూ టిప్పర్ దానిపై నుంచి వెళ్లిన ప్రమాదంతో కొల్లూరు పోలీసులు మేల్కొన్నారు. వెంటనే ఈ మలుపు వద్ద బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను కూడ నియమించారు. అయితే, మలుపు వద్ద రోడ్డును మరింత విస్తరించేందుకు ట్రాఫిక్ ఐలాండ్ తొలగించాలని వాహనదారులో కోరుతున్నారు. తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి మాత్రం కలెక్టర్ వల్లూరు క్రాంతి రోడ్డు ప్రమాదంపై అధికారులతో సమీక్షించారని, ఇక్కడ స్పీడ్ బ్రేక్‌లు వేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారని చెబుతున్నారు.


రేడియల్ రోడ్డుకు పక్కన నిర్మించిన ట్రాఫిక్ ఐలాండ్

వక్ఫ్ చట్టం రద్దయ్యే వరకు పోరాటం ఆగదు

- రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్న చట్టం
- ముస్లిం జేఏసీ సభ్యులు అబ్దుల్ షమీ
- ముస్లిం పర్సనల్ లా బోర్డు సూచనలతో సిద్దిపేట ముస్లిం జేఏసీ ఏర్పాటు
- మూడు నెలల శాంతియుత పోరాటాలకు పిలుపు

సిద్దిపేట కలెక్టరేట్ ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ చట్టం రద్దు అయ్యే వరకు ముస్లింల పోరాటం ఆగదని సిద్దిపేట ముస్లిం జేఏసీ సభ్యులు అబ్దుల్ షమీ, ముఫ్తీ కరీముద్దీన్ పటేల్ తెలిపారు. గురువారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముస్లింల అస్తిత్వాన్ని దెబ్బ తీసేవిధంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ బిల్లును వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ చట్టం రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులను కాలరాస్తుందని మండిపడ్డారు. ఫాసిస్ట్ బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి మైనారిటీలపై దౌర్జన్యాలు పెరిగిపోయాన్నారు. దేశంలో 25 శాతం ఉన్న మైనారిటీల హక్కులను కాల రాయడానికి కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నల్ల చట్టం రద్దు చేయాలన్నారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు సూచన మేరకు శాంతియుత నిరసనలు తెలుపడానికి సిద్దిపేట ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో దాదాపు 12 సామాజిక, ఉలేమాల సంస్థలు, బీఆర్ఎస్, కాంగ్రెస్, మిగతా రాజకీయ పార్టీ నాయకులతో కలిపి ముస్లిం జేఏసీ ఏర్పాటు చేశామని జేఏసీ పెద్దలు అబ్దుల్ షమీ తెలిపారు. మూడు నెలల పాటు ప్రతీ శుక్రవారం మసీద్‌ల వద్ద శాంతియుత నిరసనలు తెలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట తంజీమ్ సుప్రీం బాడీ అధ్యక్షుడు జుబెర్ హుస్సేన్, జమైతే ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖుద్దూస్, కౌన్సిలర్లు అబ్దుల్ మొయిజ్, అర్షద్, గౌస్ మోహినొద్దీన్, ఫక్రుద్దీన్ పలువురు నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం జేఏసీ నాయకులు


వర్గల్‌లో ప్రారంభానికి నోచుకోని గ్రంథాలయం

కళ తప్పిన గ్రంథాలయాలు

పాఠకులు లేక వెలవెల.. డిజిటల్ లైబ్రరీల ఏర్పాటుతో ఆసక్తి పెంచే అవకాశం


గ్రామపంచాయతీ భవనంలోని రూంలో కొనసాగుతున్న జగదేవ్‌పూర్ గ్రంథాలయం

గజ్వేల్/ గజ్వేల్ డివిజన్ బృందం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గతంలో పాఠకులతో కళకళలాడిన గ్రంథాలయాలు నేడు వెలవెలబోతున్నాయి. చేతిలో మొబైల్ ఫోన్లను పట్టుకుంటున్న యువత, పెద్దలు గ్రంథాలయాల వైపు చూడడమే లేదు. మారుతున్న సమాజానికి అనుగుణంగా గ్రంథాలయాల్లో మార్పులు చోటు చేసుకోకపోవడంతో లైబ్రరీల వైపు చూసే నాథులే కరువయ్యారు. కేవలం గజ్వేల్ పట్టణంలోని గ్రంథాలయంలో మాత్రమే పాఠకుల తాకిడి ఉండగా, మిగతా గ్రంథాలయాల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. గతంలో దినపత్రికల కోసం ఎదురుచూసే ప్రజలు ప్రస్తుతం చదవడం కోసం కూడా రావడం లేదు. చేతిలోని ఫోన్‌లోనే ఈ-పేపర్‌లు వస్తుండడంతో అందులోనే చదువుతున్నారు. కేవలం కాంపిటేటివ్ పరీక్షలు ఉన్నప్పుడు మాత్రమే ఆసక్తి ఉన్న అభ్యర్థులు గ్రంథాలయాలకు చేరుకుని చదువుకుంటున్నారు. గజ్వేల్ పట్టణంలోని శాఖ గ్రంథాలయం పాత నగర పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. కొండపాక మండల కేంద్రంలో అన్ని వసతులు ఉన్నా పాఠకుల సంఖ్య భారీగా తగ్గింది. వర్గల్ మండల కేంద్రంలో గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకోగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం కొనసాగుతుంది. గ్రామానికి దూరంగా ఉండడంతో చదవడానికి ఆసక్తి ఉన్న వారు వెళ్లడానికి ఇష్టపడడం లేదు. వర్గల్‌లో గ్రామ నడిబొడ్డున గ్రంథాలయాన్ని నిర్మించినప్పటికీ ప్రారంభం కాకపోవడంతో అందుబాటులోకి రాలేదు. ఈ భవనానికి సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కాంట్రాక్టర్ భవనాన్ని అప్పగించలేదని తెలుస్తుంది. జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామ పంచాయతీ ఆవరణలో ఉన్న గదిలో నడిపిస్తున్నారు. ప్రస్తుతం సాధారణ గ్రంథాలయాలు ఉన్నప్పటికి డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేస్తేనే పాఠకులకు ఆసక్తి ఉంటుందని పలువురు పుస్తకాల ప్రేమికులు చెబుతున్నారు.

ముగిసిన టెక్నో ఫెస్ట్

చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న టెక్నో ఫెస్ట్ 2కే25 ఉత్సవాలు గురువారం ముగిసాయి. ఈ ముగింపు కార్యక్రమానికి జేఎన్టీయూ వైస్ చాన్స్‌లర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన ఈ సందర్భంగా సైకిల్‌స్టాండ్‌ను ప్రారంభించి కళాశాలకు మంజూరైన 100 సైకిళ్లను రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావుతో కలిసి విద్యార్థులకు అందజేశారు.

\- పుల్‌కల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి)




వీపుపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రం

రజతోత్సవ అభిమానం

చేర్యాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన ఓ ఆటో డ్రైవర్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై అభిమానం చాటుకున్నాడు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న జరగనున్న రజతోత్సవ సభ నేపథ్యంలో ఆటో డ్రైవర్ పండుగ బాబు తన వీపుపై కేసీఆర్ చిత్రపటం వేయించుకోవడంతో పాటు ఛాతీ, పొట్టపై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేరు, కారుబొమ్మ వేయించుకుని, సారే మళ్లీ రావాలని ఆకాంక్షిస్తూ ప్రచారం చేశాడు.


పెయింటింగ్ వేసుకుని ప్రచారం చేస్తున్న ఆటో డ్రైవర్ పండుగబాబు

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



కంది మండలం ఇంద్రకరణ్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సదాశివపేట: భూభారతి అవగాహన సదస్సులో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి, సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి, సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి

కంది/సదాశివపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకుకు టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి సూచించారు. గురువారం కంది మండలంలోని కంది, ఇంద్రకరణ్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, మోతీలాల్, రాంచందర్, పీఏసీఎస్ చైర్మన్ దొడ్ల ప్రభాకర్ రెడ్డి, తహసీల్దార్ ఆశాజ్యోతి, సీఈవో మందాడ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే సదాశివపేట పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో భూభారతి చట్టంపై గురువారం రెవెన్యూ అధికారులు నిర్వహించిన అవగాహనా సదస్సుకు నిర్మలాజగ్గారెడ్డి హాజరయ్యారు. ఈ సదస్సులో కలెక్టర్ వల్లూరి క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి, సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి, సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

● నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



శివ్వంపేట : గుండ్లపల్లిలో ధాన్యం తూకం వేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట/అల్లాదుర్గం/మాసాయిపేట/వెల్దుర్తి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని చెన్నపూర్, చిన్నగొట్టిముక్ల, తిమ్మాపూర్, గుండ్లపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ షఫీద్దీన్, ఎంపీడీవో నాగేశ్వర్, మాజీ ఎంపీపీ హరికృష్ణ, గోపిరావు పాల్గొన్నారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ఎజెండా అని వట్‌పల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ లక్ష్మీశేషారెడ్డి అన్నారు. గురువారం అల్లాదుర్గం మండలంలోని రెడ్డిపల్లి, అప్పాజీపల్లి, ముస్లాపూర్ తదితర గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ మల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ శేరి దుర్గారెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, నాయకులు పాల్గొన్నారు. మాసాయిపేట మండలం అచ్చంపేట, మాసాయిపేట మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహులు ప్రారంభించారు. వెల్దుర్తి మండలం శెట్టిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి ప్రారంభించారు.

సమాజంలో అందరూ సమానంగా జీవించాలి



సౌండ్ లైబ్రరీకి శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో అందరూ సమానంగా జీవించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయ ఆవరణలో దివ్యాంగుల కోసం సౌండ్ లైబ్రరీ నిర్మాణానికి గురువారం ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. సౌండ్ లైబ్రరీ సమాజానికి ఒక స్ఫూర్తిదాయక మోడల్‌గా నిలవాలని ఆకాంక్షించారు. ఈ లైబ్రరీ ద్వారా చదువును వినిపించి దివ్యాంగులకు విజ్ఞానాన్ని చేరవేసే అవకాశం లభించనుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూవో లలితకుమారి, డిప్యూటీ ఇంజనీర్ దీపక్, డీసీపీవో రత్నం తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి: కలెక్టర్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మనోహరాబాద్ ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం మనోహరాబాద్ మండలం కూచారం కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాల్లో పరిశుభ్రతతో పాటు విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భద్రతపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాలలో వంట గదులు, వాష్ రూంల పరిశుభ్రతను, స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, జిల్లా పంచాయతీరాజ్ ఈఈ నర్సింలు, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు గౌతమి పాల్గొన్నారు.

జిన్నారంను మున్సిపాలిటీ చేయొద్దు

● బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

జిన్నారం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం మండలాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటుకు ప్రభుత్వం చేసిన ప్రతిపాదన వెంటనే విరమించుకోవాలంటూ బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిన్నారంలో బీజేపీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి, జిల్లా నాయకులు ప్రతాప్‌రెడ్డి, నర్సింగరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పూర్తి గ్రామీణ ప్రాంతాలు కలిగిన జిన్నారం సహా 10 పంచాయతీలను మున్సిపాలిటీగా ఏర్పాటు చేసి విలీనం చేయాలనే ప్రతిపాదన సరికాదన్నారు. అనంతరం తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీవో అరుణకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రాజిరెడ్డి, రమేష్, అశోక్ కుమార్, సుధాకర్, రాజు, కృష్ణ, సతీష్ పాల్గొన్నారు.

రజతోత్సవ సభను జయప్రదం చేయండి

నారాయణఖేడ్/పటాన్‌చెరు/జిన్నారం/చిన్నశంకరంపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం నిజాంపేటలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్‌ను తెలంగాణ సాధన కోసం కేసీఆర్ ఏర్పాటు చేసి, తెలంగాణ సాధించి పదేళ్ల రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపారన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షులు సాయిరెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు. పటాన్‌చెరు పట్టణంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శరెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ బహిరంగ సభకు సంబంధించి పోస్టర్లను, వాల్‌రైటింగ్‌ను ప్రారంభించారు. రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆదర్శరెడ్డి అన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేష్, మాజీ సర్పంచులు వెంకటేశంగౌడ్, శివరాజ్, ఖదీర్, నాయకులు ఆదర్శ్‌రెడ్డిని కలిశారు. కాంగ్రెస్ అంటేనే కరెంట్ కష్టాలని మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి అన్నారు. చిన్నశంకరంపేటలో రజతోత్సవ సభ సందర్భంగా వాల్ పెయింటింగ్స్ వేయించారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి: జడ్పీ సీఈవో

జహీరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ఇందిర్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని జడ్పీ సీఈవో జానకీరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించి మాట్లాడారు. 18 నుంచి 21 వరకు నియోజకవర్గవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల సహకారం తీసుకుంటూ అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, ఆయా మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

20న బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ గురుకుల పాఠశాలల్లో 6,7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ఈ నెల 20న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 12 కేంద్రాల్లో 2,950 మంది పరీక్ష రాయనున్నారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరగనున్నది. విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని బీసీ గురుకులాల ఆర్‌సీవో గౌతంకుమార్‌రెడ్డి కోరారు.

విద్యార్థినికి అభినందన

రామచంద్రాపురం టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ పురపాలక పరిధి వెలిమెల గ్రామానికి చెందిన 10వ తరగతి చదువుతున్న ధరణి అనే విద్యార్థిని బీహార్ రాష్ట్రం పాట్నాలో 9న జాతీయస్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి రామచంద్రాపురంలో విద్యార్థినిని సత్కరించారు.

తడ్కల్ తైబజార్ వేలం రూ.2.31 లక్షలు

కంగ్టి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ప్రతి మంగళవారం జరిగే వారాంతపు సంతకు గురువారం తైబజార్ వేలం పాట చేపట్టారు. గ్రామ ప్రత్యేకాధికారి విజయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో 2026 మార్చి 31 వరకు సంతకు బహిరంగ వేలం నిర్వహించగా.. తడ్కల్‌కు చెందిన ఎల్లుట్ల రమేష్‌గౌడ్ రూ.2.31 లక్షలకు తైబజార్‌ను దక్కించుకున్నారు.

'కోవాలెంట్'కు నోటీసు జారీ

హత్నూర, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచునూర్ గ్రామ శివారులో గల కోవాలంటే పరిశ్రమ ఆవరణలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని గ్రామపంచాయతీ కార్యదర్శి రమణారెడ్డి గురువారం నోటీసు జారీచేశారు. పరిశ్రమలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగుతున్నందున నోటీసు జారీచేసినట్లు తెలిపారు.

భేతాళస్వామికి బోనాలు

అల్లాదుర్గం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధిచెందిన అల్లాదుర్గం భేతాళస్వామి జాతరలో భాగంగా గురువారం స్వామికి బోనాలు తీసి స్వామికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

చెక్‌డ్యామ్‌లతో భూగర్భ జలాలు పెంపు

టేక్మాల్, ఏప్రిల్, 17 (ఆంధ్రజ్యోతి) : కల్వర్టులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో భూగర్భ జలాలు పెంపొందుతాయని డీఆర్డీవో శ్రీనివాస్‌రావు తెలిపారు. టేక్మాల్ మండల పరిధిలోని కుసంగి గ్రామంలో వాటర్‌షెడ్ యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో స్థానికులు, అధికారులతో ర్యాలీ నిర్వహించారు.

కక్షపూరిత రాజకీయాల్లో భాగమే ఈడీ కేసు

● డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి



నర్సాపూర్‌లో ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నర్సాపూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాల్లో భాగంగానే సోనియా, రాహుల్‌పై ఈడీ కేసు పెట్టిందని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి విమర్శించారు. గురువారం నర్సాపూర్ బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారిపై సోనియా, రాహుల్‌పై ఈడీ కేసులను నిరసిస్తూ ధర్నా చేసి, ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ బలోపేతం అవుతుండడంతో జీర్ణించుకోలేక ప్రధాని మోదీ కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రవీందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, లలిత, పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశం, పట్టణ అధ్యక్షుడు డీ.అంజిగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్, మాజీ ఎంపీటీసీ అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ఆక్రమణలు తొలగించాలి

● అధికారులతో సమీక్షా సమావేశంలో ఆర్డీవో మహిపాల్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో

నర్సాపూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ పట్టణంలో జాతీయ రహదారిపై ఆక్రమణలను తొలగించాలని ఆర్డీవో మహిపాల్ పేర్కొన్నారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో పోలీస్, మున్సిపల్, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారిపై ప్రధానంగా ఫుట్‌పాత్‌పై నడవడానికి వీలులేకుండా కొందరు వ్యాపారస్తులు తమ సామాగ్రి పెట్టి ఇబ్బందులకు గురిచేస్తుండటంతో పాటు మరికొందరు ఏకంగా రోడ్డుపై కూడా పెట్టి వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కల్పిస్తున్నందున ప్రమాదాలు జరిగే అవకాశమున్నందున వాటిని తొలగించాలని అందుకు సంబంధిత వ్యాపారులకు అవగాహన కల్పించి వారే తొలగించేలా చూడాలని లేనిచో తగిన చర్యలు తీసుకోవాలని ఆర్డీవో అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, మేనేజర్ మధుసుదన్, సీఐ జాన్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

భూములిచ్చిన రైతులకు డబ్బులు వచ్చాయి

సంగారెడ్డి కెనాల్ కోసం భూములు ఇచ్చిన రెడ్డిపల్లి గ్రామానికి చెందిన 15 మంది రైతులకు చెందిన 11.32 ఎకరాల భూమికి ప్రభుత్వం నుంచి రూ.1,86,64,963 లక్షలు వచ్చాయని, వాటిని నర్సాపూర్ తహసీల్దార్‌కు అందజేశామని, త్వరలోనే ఆ డబ్బు ఇవ్వనున్నట్లు ఆర్డీవో తెలిపారు. అదేవిధంగా బ్రాహ్మణపల్లికి చెందిన 82 మంది రైతులకు సంబంధించిన 33.04 ఎకరాల పరిహారం కూడా ఒకటి రెండురోజుల్లో రానుందని తెలిపారు.

సర్కారు బడుల్లో చురుకుగా సర్వే

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో బీఈడీ, డీఈడీ విద్యార్థుల సర్వే చురుకుగా కొనసాగుతున్నది. యూడైస్ ప్లస్‌లోని సమగ్ర వివరాల సేకరణకు విద్యాశాఖ సర్వే చేపట్టిన విషయం తెలిసిందే. మూడోరోజు కూడా యూడైస్ ప్లస్‌లో ఉన్న పాఠశాల సమగ్ర వివరాలను బీఈడీ, డీఈడీ విద్యార్థులు సరిపోల్చి చూశారు. గురువారం సంగారెడ్డిలోని గర్ల్స్ ప్రైమరీ స్కూల్‌లో బీఈడీ, డీఈడీ విద్యార్థులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామారావు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ దత్తు తదితరులు ఉన్నారు.

పాఠశాల క్యాలెండర్ ఆవిష్కరణ

కంది, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాల కార్యక్రమాలు వివరిస్తూ తయారు చేసిన క్యాలెండర్‌ను గురువారం జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న దాతలు కాశీనాథ్, సురేష్, తయ్యబ్‌ను శాలువాలతో సత్కరించారు. అంతేకాకుండా పాఠశాలకు అదనపు తరగతి గదులు వచ్చేలా కృషి చేస్తానన్నారు.

జిల్లాకు చేరుకున్న యూనిఫామ్ క్లాత్



సంగారెడ్డిలోని జిల్లా మహిళా సమైఖ్య కార్యాలయంలో భద్రపర్చిన యూనిఫామ్ వస్త్రం

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యాలయాల్లో చదివే పిల్లలకు ఏటా ప్రభుత్వం ఏకరూప దుస్తులను అందజేస్తోంది. వాటికి సంబంధించిన వస్త్రాన్ని రాష్ట్ర చేనేత సహకార సంస్థ(టెస్కో) సరఫరా చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాకు అవసరమైన వస్త్రాన్ని గురువారం పంపించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న సంగారెడ్డి, జహీరాబాద్‌తో పాటు వివిధ ఎంఆర్‌సీలకు వస్త్రం చేరుకోగా దానిని భద్రపర్చారు. జిల్లాకు వస్త్రం సరఫరా కావడంతో ఇక స్వయం సహాయక సంఘాల సభ్యులతో విద్యార్థుల దుస్తుల కొలతలు, యూనిఫామ్ కుట్టించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

ఉదయం నుంచే అధికారులు బస్తీల్లో పర్యటించాలి



అధికారులతో సమీక్ష నిర్వహించిన కార్పొరేటర్ పుష్పానగేష్

రామచంద్రాపురం టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలు నిత్యం పరిష్కరించడానికి వీలుగా ఉదయం 5 నుంచి బస్తీల్లో అధికారులు పర్యటన చేయాల్సి ఉంటుందని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. గురువారం రామచంద్రాపురం శ్రీనివాస్‌నగర్ వార్డు కమ్యూనిటీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. బాలవిహార్ పార్కును ప్రారంభించడానికి మేయర్‌తో పాటు ఎమ్మెల్యే రానున్నారని వివరించారు. రూ.1.6 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన మురుగు పైపులైన్, సీసీరోడ్డు పనులు నాణ్యతగా ఉండేటట్టు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపకమిషనర్ సురేష్, ఆరోగ్యశాఖ విద్యుత్, శానిటేషన్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రేశ్వరస్వామి జాతర ప్రారంభం

రాయికోడ్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన రాయికోడ్‌లోని భద్రకాళీ సమేత వీరభద్రుడి జాతర గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం స్వామివారి మేలుకొలుపు అభిషేకం, కుంకుమార్చన, ధ్వజారోహణం, బసవేశ్వర అభిషేకం, గ్రామ ప్రదక్షణ, శిఖర పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మహా హారతి, తీర్థప్రసాద వితరణ, అన్నదానం చేపట్టారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు అగ్నిగుండం, మధ్యాహ్నం వీరభద్రస్వామి కల్యాణోత్సవం, సాయంత్రం 6 గంటలకు రథోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు సతీష్ తెలిపారు.

ధ్రువపత్రాల జారీ కోసం రీ వెరిఫికేషన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోహీర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో ఆలస్యంపై 'అధికారుల నిర్లక్ష్యం.. ఇదిగో సాక్ష్యం' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో గురువారం కథనం ప్రచురితమైంది. దీంతో మండల రెవెన్యూ అధికారులు స్పందించారు. మరణ ధ్రువీకరణ పత్రం కోసం వచ్చి కార్యాలయంలో రోదించిన బాలిక గోపిక ఇంటికి వెళ్లి ఆ పత్రానికి సంబంధించి డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్ రీ-వెరిఫికేషన్ నిర్వహించారు. గోపిక కుటుంబసభ్యులకు సంబంధించి అన్ని వివరాలు తెలుసుకుని మరణ ధ్రువీకరణ పత్రం సాధ్యమైనంత త్వరగా జారీచేసేలా చూస్తామన్నారు. మండల తహసీల్దార్ బాలశంకర్ మాట్లాడుతూ ధ్రువపత్రాల జారీలో ఆలస్యం జరిగితే తహసీల్దార్‌ను సంప్రదించాలన్నారు.

రెండురోజుల్లో బీపీ పరీక్షల యంత్రం

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నారాయణఖేడ్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): 'బస్తీ దవాఖానాలో బీపీ పరీక్షలు ప్రశ్నార్థకం' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 15న ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్యాధికారి స్పందించారు. రెండురోజుల్లో పరికరాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. బస్తీ దవాఖానాలో బీపీ యంత్రం లేని విషయం ఆంధ్రజ్యోతి ద్వారా తమ దృష్టికి వచ్చిందని, రెండురోజుల్లో కొత్త యంత్రాన్ని పంపిస్తామన్నారు.


'గర్భిణులకు పౌష్టికాహారం అందజేయాలి'

తూప్రాన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులకు పౌష్టికాహారం అందజేయాలని డిస్ట్రిక్ వెల్ఫేర్ ఆఫీసర్ హైమావతి సూచించారు. తూప్రాన్ పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ నిర్వహించారు. అలాగే పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రం-6లో కూడా పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో హేమభార్గవి, సూపర్‌వైజర్లు శివకుమారి, సుజాత, సంతోష, మెహత పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న ఐసీడీఎస్ అధికారులు

శివ్వంపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాన్ని అడ్డుకున్న సంఘటన మండలంలోని ఓ తండాలో చోటు చేసుకున్నది. తండాకు చెందిన గిరిజన బాలిక(15) వివాహం చేసేందుకు కుటుంబసభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. గ్రామస్థుల ద్వారా విషయం తెలుసుకున్న నర్సాపూర్ సీడీపీవో హేమభార్గవి, శివ్వంపేట సూపర్‌వైజర్ సంతోష తండాకు వెళ్లి వివాహాన్ని అడ్డుకుని, కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు.

తిరుపతికి వెళ్తున్నానని చెప్పి వ్యక్తి అదృశ్యం



బల్లెపు సంగయ్య (ఫైల్)

జహీరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి అదృశ్యమైన సంఘటన మొగుడంపల్లి మండలం జాడిమల్కాపూర్‌లో చోటు చేసుకున్నది. జహీరాబాద్ రూరల్ ఎస్ ప్రసాదరావు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బల్లెపు సంగయ్య(34) ఈనెల 1న తిరుపతికి పోతున్నాని ఇంట్లోంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగిరాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య స్వప్న గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆచూకీ తెలిసినవారు 8712656764, 8712661847 నెంబర్లకు సమాచారమందించాలన్నారు.

గుండ్లపల్లిలో ఒకరు..



కుల్ల మల్లేష్(ఫైల్)

శివ్వంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో ఇంట్లో నుంచి వెళ్లిపోయిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన గురువారం గుండ్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని గుల్లపల్లి గ్రామానికి చెందిన కుల్ల మల్లేష్(40) ఇంట్లో చిన్నపాటి ఘర్షణ తలెత్తడంతో మనోవేదనకు గురై బుధవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగిరాలేదు. చుట్టుపక్కల, బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలి

నారాయణఖేడ్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం ప్రకారం అడిగిన వారందరికీ పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహులు డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని ర్యాకల్, సిర్గాపూర్ మండలం సిర్గాపూర్, కడ్పల్ శివార్లలోని ఉపాధిహామీ పని ప్రదేశాల్లో పర్యటించి ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. ఉపాధిహామీలో చెరువులు, కుంటలు, కాల్వల పనులను కేంద్ర ప్రభుత్వం ఎత్తేయడంతో అవసరం ఉన్న కూలీలకు పనులు దొరకడం లేదన్నారు. ఆయా పనులను పునరుద్ధరించి కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.600 కూలీ చెల్లించడంతో పాటు బకాయి డబ్బులను చెల్లించాలన్నారు.

అంగన్‌వాడీలతో చిన్నారుల భవిష్యత్‌కు బాటలు



లింగాపూర్ అంగన్‌వాడి కేంద్రంలో ప్రగతి రిపోర్టులు అందుకున్న చిన్నారులు

నారాయణఖేడ్/జిన్నారం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల భవిష్యత్‌కు బాటలని ఖేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో సుజాత అన్నారు. ఖేడ్ మండలం లింగాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించారు. గ్రాడ్యుయేట్లకు పట్టాలు అందించేరీతిలో చిన్నారులకు ప్రగతిరిపోర్టులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షకురాలు ప్రమీల, శిశుసంక్షేమశాఖ సమన్వయకర్త నర్సింలు, అంగన్‌వాడీ టీచర్లు, ఇందిర, సునీత, విజయ, మాజీ ఎంపీటీసీ లక్ష్మి పాల్గొన్నారు. జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని 19 అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. లక్ష్మీపతిగూడెంలో నిర్వహించిన వేడుకల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మీరాబాయి, మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్ చిన్నారులకు పట్టాలు అందజేశారు.